క్లుప్తంగా

సచివాలయ కార్యదర్శులకు క్రికెట్ పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సచివాలయ ఉద్యోగుల మానసిక ఉల్లాసం కోసం ఆట విడుపు కార్యక్రమం చేపట్టామని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల అనుమతి మేరకు శనివారం ఆయన జోనల్ స్థాయిలో సెక్రటరీల క్రికెట్ పోటీల బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సెక్రటరీలు కొన్ని నెలలుగా సర్వేలు, కార్యాలయ పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. వీరి ఉత్సాహం కోసం ఈ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. జోన్ పరిధిలో 64 సచివాలయాల్లో 150 మంది, జోన్-4 కార్యాలయ సిబ్బందితో టోర్నమెంట ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 7 జట్లుగా విభజించామన్నారు. ఉదయం 6 నుంచి మెడికల్ గ్రౌండ్‌లో టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు సీతారామయ్య, వీరబాబు, ఉదయ్ భాస్కర్, సెక్రటరీలు భార్గవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

మరాఠా వీర వనిత అహల్యాబాయ్ హోల్కర్



అహల్యాబాయ్ హోల్కర్‌కు నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట: మూడొందల ఏళ్ల క్రితమే ఇండోర్ నగరాన్ని సుందరీకరించి, జల సంరక్షణ, రోడ్ల విస్తరణ, రైతుల సంక్షేమం, తపాలా సౌకర్యం వంటి సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత మరాఠా వీర వనిత అహల్యాబాయ్ హోల్కర్‌కే దక్కుతుందని బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. ఆహార తోపుడు బండ్ల సంక్షేమ సంఘం, భారతీయ జనతా పార్టీ వీధి విక్రయదారుల హాకర్స్ కమిటీ, శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, పాత జైలు రోడ్డు దరి కూరగాయల మార్కెట్, డాబాగార్డెన్స్ వీధి విక్రయదారుల సంయుక్త నిర్వహణలో జరిగిన అహల్యాబాయి జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా అహల్యాబాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి అహల్యాబాయ్ ప్రేరణతోనే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆహార తోపుడుబండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాకమర్రి బాలాజీ, వెజిటేబుల్ మార్కెట్ అధ్యక్షుడు పిన్నింటి నారాయణ, గేదెల శ్రీహరి, అప్పలరాజు, రమణ, రాము, అప్పల నరసమ్మ, పోతు నాయుడు, సింహాచలం, అలీ, మధు, షేక్ బాషా, కృష్ణ, శ్రావణి, రమణమ్మ, మంగ తాయారు, కనకమహాలక్ష్మి, నందిని, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామమోహన్‌కు పదోన్నతి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో పర్యవేక్షకునిగా పని చేస్తున్న రామమోహన్‌కు అకౌంట్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. దీంతో కేజీహెచ్ ఎంఆర్‌వో డాక్టర్ జవహర్, ఏఎంసీ అకౌంటెంట్ శ్రీనివాస్, ఇతర అధికారులు గోపి, పద్మాలోచన, ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, అధికారులు, కేజీహెచ్ అధికారులు రామమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

కౌన్సిల్ అజెండాలో ఈ అంశాలు చేర్చండి

- మేయర్‌కు సీపీఎం కార్పొరేటర్ లేఖ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం అజెండాలో పలు అంశాలను చేర్చాలని కోరుతూ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు మేయర్ పీలా శ్రీనివాసరావుకు లేఖ రాశారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను పెంపుదల రీసర్వే చేపట్టారని, కౌన్సిల్‌లో చర్చించకుండా రీసర్వే నిర్వహించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఆస్తిపన్ను రీసర్వే, పన్ను తగ్గింపు, ఆస్తిపన్ను పేర్ల మార్పు, పట్టాలు లేని ఇళ్లకు ఆస్తిపన్ను, 45 గజాలలోపు ఇళ్లకు రూ.50 వేల పన్ను విధింపు వంటి ముఖ్యమైన అంశాలపై సమావేశంలో చర్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పరిధిలోని కాలనీ పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణల గురించి కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల హక్కులకు రక్షణ కల్పించాలని, ఈ అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలని కోరారు. కోళ్ల వ్యర్థాల కుంభకోణంపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ షాపులు, ప్రకటనల అద్దెలు, ఇతర ఆదాయ వనరులపై, అలాగే జీవీఎంసీ ఆదాయ వ్యయాలపై సమగ్ర చర్చ జరగాలని గంగారావు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

వ్యాధుల కాలం.. జర భద్రం



కొబ్బరితోట పీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



రోగికి వైద్యసేవలు



జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

- వాతావరణ మార్పులతో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి
- జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి

అల్లిపురం: ఇటీవల వాతావరణం భిన్నంగా ఉంటోంది. మధ్యాహ్నం వరకు మండుటెండతో బెంబేలెత్తిస్తోంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై వర్షం పడుతోంది. కొన్ని రోజులుగా ఎండ వేడిమితో పాటు ఉక్కపోత అధికమైంది. ఉదయం 7 గంటల కల్లా భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 5 అయ్యేసరికి చల్లబడి గాలులు వీస్తున్నాయి. ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. ఈ విధంగా జరిగే వాతావరణ మార్పులతో చిన్నపిల్లలు, వయసు మళ్లిన వారు ఇబ్బందులకు గురవుతున్నారు. వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతో ఎదురయ్యే సమస్యలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ఇబ్బందులు ఇవే..

ఒకేరోజు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు పడుతూ చల్లబడిన వాతావరణంతో మొక్కల నుంచి పుప్పొడి రేణువులు గాలిలో కలుస్తాయి. దీంతో ఆస్తమా, ఎలర్జీ, గొంతునొప్పి, తుమ్ములు ఎక్కువగా రావడం, న్యూమోనియా, బ్రాంకైటిస్, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత, తేమ ఉన్నప్పుడు చెమట పట్టి ఫంగస్, బాక్టీరియా ఇన్ఫెక్షన్ రావడానికి అవకాశం ఉంటుంది. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయి. దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెంది వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మైగ్రేన్ వంటి సమస్యలు ఉన్న వారికి మరింత ఇబ్బందిగా ఉంటుంది. చిన్న పిల్లలు, వృద్ధులు త్వరగా వడదెబ్బకు గురవుతారు. సోడియం, పొటాషియం లవణాల సమతుల్యతలో తేడా ఏర్పడి ఇబ్బంది పడతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

గదిలోకి గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. దీంతో గాలి నుంచి వచ్చే ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. వృద్ధులు మండుటెండలో తిరగకూడదు. రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి. నూనె పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. దాహం వేయకున్నా ప్రతి అరగంటకు కొద్దిగా మంచినీరు తాగుతూ ఉండాలి. రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు విటమిన్-సి ఎక్కువగా ఉండే సిట్రస్ పళ్ల రసాలు, తాజా కూరగాయలు తీసుకోవాలి.

నిర్లక్ష్యం చేయొద్దు...

జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయ వద్దు. ఇలాంటి సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించి వైద్యసేవలు పొందాలి. వైద్యులు సూచించిన మందులు మాత్రమే వాడాలి. సామాజిక మాధ్యమాల్లో చూసిన వాటిని అనుసరించకూడదు. అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రామకృష్ణ, జనరల్ ఫిజీషియన్, హెచ్‌వోడీ, కేజీహెచ్

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో..

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా నివాస పరిసరాల్లో అపారిశుధ్యానికి తావు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్‌తో హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

డాబాగార్డెన్స్: అవినీతి అంతం.. మానవ హక్కుల సంరక్షణకు ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ ఏర్పడిందని ఆ సంస్థ సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ తెలిపారు. అవినీతిని అంతం చేయడానికి వెనుకాడబోమని, ప్రజల సమస్యలపై నిత్యం పోరాడుతామని, ఎవరికి ఎటువంటి అన్యాయం జరిగినా ఆర్‌టీఐని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర స్థాయి కమిటీని ఆయన ప్రకటించి మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును ఆర్‌టీఐ సూచిస్తుందన్నారు. ఈ చట్టం, సమాచారం కోసం ప్రజలకు ఒక మార్గాన్ని కల్పిస్తూ, అధికార దుర్వినియోగాన్ని నియంత్రిస్తుందన్నారు.

నూతన కమిటీ..

ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ ఏపీ కమిటీ స్టేట్ కన్వీనర్‌గా టి. భీమారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. గణేష్, ప్రధాన కార్యదర్శిగా వి.వేణుగోపాల్, డాక్టర్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టర్ పీవీ రమణమూర్తి, డాక్టర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్ఎస్‌పీ సుబ్రహ్మణ్యం, వింగ్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కె.ప్రసాద్, ఆర్గనైజర్‌గా బి. శ్రీను, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కె.ఈశ్వరరావు, లీగల్ విభాగం అధ్యక్షుడిగా విశ్వనాథ్, ఎం. శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ఎం.మల్లిక్, వరలక్ష్మి, రెడ్డి, అన్వేష్, రామ్, రాజేష్, రమేష్, వినయ్, గౌతమ్, రామకృష్ణ, వెంకటరమణ, సత్యనారాయణను ఎంపిక చేస్తూ గుర్తింపు కార్డులు అందజేశారు.

లిక్కర్ డాన్ చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి
- జూన్ 4 వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్: చంద్రబాబు 25 వేల కోట్ల లిక్కర్ కుంభకోణం చేసిన లిక్కర్ డాన్ అని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. తన మామ ఎన్‌టీ రామారావునే కాదు.. రాష్ట్ర ప్రజలకూ చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఈ నెల 4న కేంద్ర పార్టీ పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఐదు వేల కోట్లు చొప్పున బాబు అవినీతికి పాల్పడ్డాడని స్వయంగా కాగ్ రిపోర్టు బయటపెట్టిందన్నారు. ఈ డబ్బు మొత్తం చంద్రబాబు జేబులోకి వెళ్లిందని ఆరోపించారు. ఈ స్కామ్‌లో బెయిల్‌పై చంద్రబాబు ఉన్నాడని, నేడు అదే కోవలో కూటమి ప్రభుత్వంలో ఊరూరా బెల్ట్ షాపులు పెట్టి ఇష్టానుసారంగా రేట్లు పెంచాడని దుయ్యబట్టారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని ఆపకుండా పేదలను ఆదుకున్నారని ఈ సందర్భంగా తెలిపారు. అప్పుడు కూడా 8.9 శాతం జీడీపీ ఉండగా.. నేడు చంద్రబాబు ప్రభుత్వంలో 3.8కి జీడీపీ తగ్గినప్పటికీ కేంద్ర బీజేపీ చూస్తూ ఊరుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

కూటమి ఏడాది పాలన వెన్నుపోటు దినాలే..

ఏడాది పాలనలోనే రాష్ట్రాన్ని చంద్రబాబు సర్వనాశనం చేసినా.. ప్రశ్నించలేని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమలు కాని హామీలిచ్చి, అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. నాడు ఇంటి వద్దకే రేషన్ అందించడానికి జగన్‌మోహన్‌రెడ్డి 9500 వాహనాలు సబ్సిడీ ద్వారా కేవలం నాలుగు లక్షలకే అందించి, 18500 మందికి ఉపాధి కల్పించారన్నారు. తద్వారా రాష్ట్రంలో కోటి 50 లక్షలకు పైగా రేషన్ కార్డుదారులకు దుకాణాలకు వెళ్లకుండా ఇంటి వద్దకే రేషన్ అందిస్తే.. దానిని కూడా చంద్రబాబు నిర్వీర్యం చేయడం దుర్మార్గమన్నారు. 18500 మంది వ్యాన్ డ్రైవర్లు, పరోక్షంగా పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడేసారన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన జీవీఎంసీ ఉద్యోగులకు వీడ్కోలు



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జీవీఎంసీ అధికారులు

అల్లిపురం: ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఉద్యోగి శేష జీవితం ఆనందంగా గడపాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన 12 మంది అధికారులు, ఉద్యోగులను ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి. నరేష్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు పద్మజ, అప్పలనాయుడుతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం మనతో విధులు నిర్వర్తించి నేడు విధులను విడిచి వెళుతున్నందుకు తోటి ఉద్యోగులందరికీ బాధ కలుగుతుందన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అదనపు కమిషనరు డి.వి.రమణ మూర్తి పీఎఫ్ చెక్ అందించి, జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి. నరేష్ కుమార్, ఏడీడబ్ల్యుఈఎంఎస్, జేమ్స్ జనరల్ సెక్రెటరీ అప్పలరాజు, స్పోర్ట్స్ డైరెక్టరు రాజు, సూపరింటెండెంట్లు సన్ని, రియాజ్, ఇతర అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: డాబాగార్డెన్స్ పెన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కానిస్టేబుల్స్ మెయిన్ పరీక్షా కేంద్రాన్ని శనివారం ఉదయం ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, ఫైర్ అండ్ సేఫ్టీ వసతులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రం, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పరీక్ష ముగిసేంత వరకు జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, పరీక్షలు కొనసాగుతున్నంత సేపు మొబైల్ పెట్రోలింగ్ బృందం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తుందని ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. పరీక్ష ముగిశాక ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు తరలించేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. 350 మంది విద్యార్థులు పెన్ స్కూల్ కేంద్రంగా పరీక్ష రాయబోతున్నట్టు ఏసీపీ తెలిపారు. ఎస్ఐ ఎ. మన్మథరావు వారి వెంట ఉన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-2 పరిధి 6, 7 వార్డుల్లో ఈ నెల 2న తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే 700 ఎంఎం డయా పైప్‌లైన్ మారికవలస ఎం.ఆర్.ఎఫ్. టైర్స్ షోరూం వద్ద లీకులకు గురి కావడం కారణంగా మరమ్మతుల నేపథ్యంలో నీటి పంపింగ్ నిలుపుదల చేయడమైందన్నారు. ఈ కారణంగా సోమవారం ఆయా వార్డుల పరిధిలో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందన్నారు. 6వ వార్డు కొమ్మాది విలేజ్, ఎం.ఎస్.ఆర్. లే అవుట్, సాయిప్రియ లే అవుట్, సంపత్‌నగర్, లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, తులసీనగర్, 7వ వార్డు పరిధి చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్జీవోస్ కాలనీ, వుడా కాలనీల్లో అంతరాయం ఏర్పడుతుందని, ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు.

ఉత్సాహంగా ముగిసిన సమ్మర్ క్యాంప్



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

డాబాగార్డెన్స్: ప్రజా నాట్యమండలి, శ్రీసాయి కళానికేతన్, రాగిణి కూచిపూడి నాట్యమండలి, శ్యాం వెస్ట్రన్ డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 30 వరకు ఎస్‌డీ కొత్తరోడ్డు కరాస వద్ద ప్రజానాట్యమండలి జిల్లా కార్యాలయం హష్మీ భవన్ వేదికగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శనివారంతో ముగిసింది. నెల రోజుల పాటు పిల్లలకు పలు రకాల నృత్యాలు నేర్పించారు. నెల రోజుల పాటు పిల్లలు నేర్చుకున్న నృత్యాలను డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ప్రదర్శించారు. సమ్మర్ క్యాంప్‌లో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జీవిత విశేషాల ఆధారంగా రూపుదిద్దుకున్న నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పి. రఘు, అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వీఎస్ పద్మనాభరాజు, కార్యదర్శి ఎం. చంటి మాట్లాడారు. పిల్లలు చదువుతో పాటు సమాజ పరిణామాలను కూడా అవగతం చేసుకోవాలన్నారు. దానికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సమ్మర్ క్యాంపు ద్వారా అటువంటి ప్రయత్నం చేయడం అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో బాల బాలికలకు ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహించి, ప్రత్యేక నృత్యాల్లో తర్ఫీదిచ్చి సమాజ వికాసానికి తోడ్పాటు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు జి. రమణ, సహాయ కార్యదర్శి స్టాలిన్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వీ రమణ, ఎం.నాగేశ్వరరావు, కూచిపూడి డ్యాన్స్ మాస్టర్ ఎం.రాగిణి, వెస్ట్రన్ డ్యాన్స్ మాస్టర్ బి.శ్యామ్, లాస్య, యోగిత బిందు, పి. రఘు తదితరుల చేతుల మీదుగా పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు.

జీవితాలను చిత్తు చేసే పొగాకు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఉద్యోగులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పొగాకు తాగే వారి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, అందుకే భారత ప్రభుత్వం పొగాకును కొన్ని బహిరంగ ప్రదేశాలలో వినియోగించడం నిషేధించిందన్నారు. ప్రతి సంవత్సరం పొగాకు, ధూమపానం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించేందుకు మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక మాట్లాడుతూ పొగాకు నియంత్రణకు అన్ని డిపార్టుమెంట్లు కలిసి పని చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ పంచాయతీ సభ్యులు, ఎన్జీవో సంస్థలు, రైతులు, యువత, విద్యార్థులు పొగాకు రహిత దేశ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు ధర్మేంద్ర, మోహన్, వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్నేహ, సాంస్కృతిక, ఉద్యమాల సారథి సుకుమారన్



మాట్లాడుతున్న ఆచార్య కేఎస్ చలం

డాబాగార్డెన్స్: కమ్యూనిస్ట్ యోధుడిగా, శాంతి, సాంస్కృతిక ఉద్యమాల సారథిగా పేరున్న టీఎస్ సుకుమారన్ అందరి మన్ననలు పొందారని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆచార్య కేఎస్ చలం పేర్కొన్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, సీపీఐ నాయకుడు, ఇస్కఫ్ నాయకుడు సుకుమారన్ ఇటీవల మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఎస్ చలం మాట్లాడుతూ విశాఖలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా గుర్తుకు వచ్చే పేరు సుకుమారన్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజానికి తన వంతు ఏదో ఒకటి చేయాలన్న ఆత్రుతతో ఉండేవారన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాగితాల రాజశేఖర్, జాతీయ ప్రధాన కార్యదర్శి పడిహారి, ఇస్కఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ కడారు ప్రభాకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి పి. బియజ్‌కుమార్, ఆచార్య వి. బాలమోహన్‌దాస్, పీవీఎస్ మూర్తి, నరసింహులు, క్షేత్రపాల్‌రెడ్డి, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, నాయకులు పైడిరాజు, మాధవరావు, మధుమతి, సురేష్‌కుమార్, నర్సింహమూర్తి, పిచ్చయ్య, ఎస్‌పీ రమేష్, లక్ష్మీ గణపతి, సూర్యనారాయణ, అరుణ్‌కుమార్, రాజు, ఆచార్య మంజులత తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తీయాలి



రామకృష్ణ జంక్షన్ వద్ద మురుగు కాలువను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: కాలువల్లో వెంటనే పూడికలు తీయాలని జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిన రహదారులను ఆయన పరిశీలించారు. రహదారులపై నీరు నిలిచిపోవడానికి గల కారణాన్ని జెడ్సీ పరిశీలించారు. రామకృష్ణా రైతుబజార్, రామకృష్ణానగర్, వెలంపేట, చికలపేట, పోర్టు దరి కెనాల్, కాన్వెంట్ జంక్షన్ వద్ద ఉన్న ప్రధాన కాలువలను ఆయన పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది రహదారిపై చెత్త తరలించి ఇళ్లకు వెళ్లిపోతున్నారన్నారు. శానిటరి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిల్ట్, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీటి ప్రవాహం ఆగిపోతుందన్నారు. ఫలితంగా నీరు రోడ్లు, ఇళ్లు, దుకాణాల మధ్యకి చేరిపోతుందన్నారు. దీనివల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు బాధ్యత వహించి కాలువలను శుభ్రం చేసి ఆ వివరాలు జెడ్సీలో గ్రూప్‌లో పెట్టాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి



కేక్ కట్ చేసి వాసుపల్లికి తినిపిస్తున్న సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని బుజ్జి

డాబాగార్డెన్స్: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశీల్‌మెట్ట వద్ద గల వాసుపల్లి కార్యాలయంలో బుజ్జి (వి.సుబ్రహ్మణ్యం) అభిమానుల ఆధ్వర్యంలో వాసుపల్లిచే కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు వన్నె తెచ్చిన కృష్ణ సినిమాలు చూస్తూనే తాను పెరిగానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్‌కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, అలపన కనకారెడ్డి, లండా రమణ, మళ్ల బుజ్జి, గంగాధర్, జీరు సుధ, దుర్గాప్రసాద్ పలువురు కార్యకర్తలు, సూపర్ స్టార్ కృష్ణ అండ్ మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

పల్లవీ మ్యూజిక్ సంస్థ ఆధ్వర్యంలో

పల్లవీ మ్యూజిక్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, మ్యూజిక్ సినీ సంగీత సంస్థ ప్రతినిధి, కార్యక్రమ కన్వీనర్ పల్లా బాబ్జి, కొణతాల రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, వర్రె నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పార్కులో..

సూపర్ స్టార్ కృష్ణ జయంతిని విశాఖ సిటీవైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరస్వతీ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. మన్యాల శ్రీనివాస్, డొప్ప రమణ, కాకి సోంబాబు, జోరేగల గణేష్, ఆర్జి శంకర్రావు, అక్కరబోయిన శ్రీనివాస్, నీలాపు శ్రీనివాస్, నమ్మి గణేష్, వెంకట్రావు, రాజు, కేబుల్ శ్రీను, అధిక సంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గన్నారు.

డేరింగ్ అండ్ డ్యాషింగ్ హీరో కృష్ణ..

జగదాంబ: సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాని అప్పారావు ఆధ్వర్యంలో శ్రీకాంతి థియేటర్‌లో నటశేఖర కృష్ణ జయంతి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. తాను కృష్ణ అభిమానినని ఆయన తెలిపారు. పరిశ్రమలో డేరింగ్ అండ్ డ్యాషింగ్ హీరో కృష్ణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.